లక్ష్యానికి దూరంగా కొనుగోళ్లు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

యాసంగి వరికోతలు పూర్తి కావస్తున్నా ధాన్యం కొనుగోళ్లు మాత్రం లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. మూడునాలుగు రోజుల్లో జిల్లావ్యాప్తంగా వరి కోతలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు మార్కెట్‌కు వసాయని అంచనా వేసిన ధాన్యంలో 70శాతం మాత్రమే కొనుగోలు చేశారు. ఎండ తీవ్రత హమాలీలు, లారీల కొరత కారణంగా ధాన్యం తూకం వేయడం ఆలస్యమవుతున్నదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తెలుపుతున్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొని వెళ్ళి వారం నుంచి పది రోజులు పడిగాపులుపడాల్సి వస్తున్నదని రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

● 318 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ఈ యాసంగిలో 2.5 లక్షల ఎకరాల వరిసాగు చేయగా 6,33,943 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అం చనా వేసింది. ఇందులో 2,51,099 మెట్రిక్ టన్నుల ధాన్యం విత్తనపంట కావడంతో ఆ ధాన్యాన్ని ఆయా కంపెనీలే కొనుగోలు చేస్తాయి. ప్రధానంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో రైతులు విత్తన పంటను ఎక్కువగా సాగు చేశారు. మరో 2,307 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు సొంత అవసరాలకు తమ వద్దే ఉంచుకుంటారని, 30,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. ఈ ధాన్యం పోను 3.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించి వాటిని ఖరీదు చేయడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 341 కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్, హాకా ద్వారా ఏర్పాటు చేశారు. వీటిలో 318 కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 33,056 మంది రైతుల నుంచి రూ. 436.45 కోట్ల రూపాయల విలువ చేసే 198115 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 1,81,080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయగా 1,58,434 మెట్రిక్ టన్నుల ధాన్యం తమకు చేరిందని మిల్లర్లు ధ్రువీకరించారు. మిగతా ధాన్యం మిల్లర్లకు చేరాల్సి ఉండగా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో 80 శాతం మొత్తానికి రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశారు. 26,297 మంది రైతులకు 347 కోట్ల 21 లక్షల రూపాయలు వారివారి ఖాతాల్లో జమ చేశారు. అకాల వర్షాలు పడే అవకాశాలున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి నష్టం జరుగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

- దిగుబడి అంచనా 6.34 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు కేంద్రాలకు వచ్చేది 3.50 లక్షల మెట్రిక్ టన్నులని అంచనా
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 1.98 మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 436.45 కోట్లు
- రైతులకు చెల్లించింది రూ. 347.21 కోట్లు

● అకాల వర్షాల భయం

ఈ నెలాఖరుకు నైరుతీ రుతుపవనాలు వస్తాయని, జూన్ మొదటి నుంచే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటిస్తున్న నేపథ్యంలో వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన పడుతున్నారు. ఇప్పటికే ఒకసారి అకాల వర్షాలు వచ్చి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడపగా వచ్చే నాలుగురోజులు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు చెబుతుండడంతో మళ్లీ ధాన్యం తడిసే ప్రమాదం లేకపోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. యాసంగిలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొని వస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు నెలరోజులుగా 1,98,115 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో 1.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇందులో సగానికిపైగా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడం కోసం, తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించడం కోసం పడిగాపులు పడుతున్నది. 865 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉన్నదని అధికారులు పేర్కొంటుండగా కాంటా కాకుండా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అంతకు పదింతలు ఉందని రైతులంటున్నారు. గతంలో మాదిరిగానే ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 341 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని నిర్ణయించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

● కలెక్టర్ పమేలా సత్పతి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, మే 15: నకిలీ విత్తనాలు, కాలం చెల్లించిన విత్తనాలు, నిషేధిత పురుగు మందులు, నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి డీలర్లు, వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లాలోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల విక్రయ డీలర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు, నిషేధిత పురుగుల మందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. డీలర్లు, వ్యాపారులు ఇటువంటి వాటిని విక్రయించవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమించి విక్రయిస్తే పీడీ యాక్ట్ బుక్ చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, పీవోఎస్ మిషన్ ద్వారానే ఎరువులు అమ్మాలని ఆదేశించారు. గ్రౌండ్ స్టాక్ ఎరువుల నిల్వలు, పీవోఎస్ మిషన్‌లోని నిల్వలతో సరిపోవాలన్నారు. మండల వ్యవసాయాధికారులు పదిహేను రోజులు, నెలరోజులకొకసారి ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే సీజన్‌లో డీలర్లంతా ఎలాంటి కల్తీలేని, ఆరోగ్యకరమైన వ్యాపారం చేయాలని, రైతులకు నష్టం జరిగేలా వ్యవహరించకూడదని ఆదేశించారు. సమావేశానికి మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ మేనేజర్ దివ్యభారతి, జిల్లా సహకార అధికారితోపాటు అన్ని మండలాల వ్యవసాయాధికారులు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూంల వద్ద ఉన్న భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నగరంలోని ఎస్సారార్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల పరిసరాల్లో వాకర్స్, ఇతర వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్, టౌన్ ఏసీపీ నరేందర్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయ్యేదెన్నడో?



నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

● రోడ్డుపైనే అమ్మకాలతో ఇబ్బందులు

చొప్పదండి, మే 15: చొప్పదండి మున్సిపాలిటీగా మారి ఐదేళ్లు గడిచాయి. పన్నులు పెరిగాయే తప్ప ఎటువంటి మౌలిక సదుపాయాలు సమకూరలేదు. ఇప్పటికీ సరైన మార్కెట్ లేక రోడ్డుపైనే మాంసం, కూరగాయల అమ్మకాలు కొనసాగుతున్నాయి. వారసంత 50 ఏళ్లుగా రోడుపైనే కొనసాగుతుంది. 2022 ఫిబ్రవరిలో అప్పటి మంత్రి కేటీఆర్ రెండు కోట్ల నిధుల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆరు నెలల తరువాత నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత పనులు నిలిపివేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డుకిరువైపులా కూరగాయలు, పండ్ల దుకాణాలు, మాంసం, చేపల అమ్మకాలు కొనసాగుతుండగా పోలీస్ స్టేషన్ రోడ్డుపై ప్రతి శుక్రవారం వారసంత కొనసాగుతుంది. ఈ రోడ్డుపై తహసిల్దార్, మండల పరిషత్, పోలీస్‌స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ మున్సిపల్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇదే రహదారిపై వారసంత నిర్వహిస్తున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై నిర్వహిస్తున్న వారసంత (ఫైల్)

నల్లా నీటి కోసం నిరీక్షణ



● శివారుకాలనీలో తాగునీటికి ఇక్కట్లు

కరీంనగర్ టౌన్, మే 15: మండుతున్న ఎండలతో భూగర్భజలాలు అడుగంటి పోయి బోరుబావులు ఎండిపోతున్నాయి. దీంతో అనేక కాలనీల్లో నగరవాసులు నల్లా నీటిపైనే ఆధారపడుతున్నారు. దిగువ మానేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పడిపోయి 5.5 టీఎంసీలకు చేరాయి. తాగునీటికి ఇబ్బంది రావద్దనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నది. ఇటీవలి వరకు కరీంనగర్‌లో ప్రతిరోజూ తాగునీటిని అందించారు. హౌసింగ్ బోర్డుకాలనీతోపాటు రాంపూర్ రిజర్వాయర్ పరిధిలో 24/7 మంచినీటిని ట్రయల్ రన్‌గా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుంటే రాబోయే రోజుల్లో నగరమంతటా అందిస్తామన్నారు. గత సంవత్సరం ఆగస్టులో అప్పటి మంత్రి కేటీఆర్‌తో 24/7 తాగునీటి పథకానికి ప్రారంభోత్సవం చేశారు. దీనితో నగరంలో ఇక తాగునీటి అవసరాలకే కాకుండా బోరుబావులు, మోటార్లు వాడుకునే అవసరం రాదని ప్రజలు సంతోషించారు. పరిస్థితి మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇబ్బందులతో నీటి నిల్వలు ఖాళీ అయ్యాయి. ఈసారి ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. మిడ్ మానేరు, లోయర్ మానేరు రిజర్వాయర్లతోపాటు చెరువులు, కుంటల్లో నీటి నిలువలు తగ్గిపోయాయి.

తాగునీటిని వృథా చేయొద్దు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్‌కు నీరందిస్తున్న దిగువ మానేరు జలాశయం (ఎల్‌ఎండి)లో నీటినిలువలు 5.5 టీఎంసీలకు చేరడంతో రోజు విడిచి రోజు తాగునీటిని అందిస్తున్నాం. ప్రతిరోజు 55 మిలియన్ లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని నల్లాలు, ట్యాంకర్ల ద్వారా నగర ప్రజలకు అందిస్తున్నాం. తాగునీటి వృథా చేయకుండా వినియోగించుకోవాలి. ఎల్‌ఎండీలో నీటి నిలువలు 10 టీఎంసీలు దాటితే ప్రతి రోజు అందిస్తాం.

● రోజు విడిచి రోజు నీటి సరఫరా..

ఎల్‌ఎండీ లో నీటి నిలువలు తగ్గడంతో రోజు విడిచి రోజు నల్లానీరు ఇస్తున్నారు. గతంలో ప్రతిరోజు 55 ఎంఎల్‌డీ నీటిని నగర ప్రజలకు అందించిన మున్సిపాలిటీ ప్రస్తుతం రెండు రోజులకొకసారి నల్లానీటిని ఇస్తున్నప్పటికీ రోజు 55 ఎంఎల్‌డీ నీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తుంది. రెండురోజుల కొకసారి నల్లా నీరు రావడం, వేసవి కారణంగా నీటి అవసరాలు పెరుగడం, మరోవైపు గతంలో మాదిరిగా కాకుండా 45 నిమిషాల నుంచి గంట సేపు మాత్రమే నల్లానీటిని ఇస్తుండడంతో సరిపోవడం లేదని ప్రజలు ఆవేదనచెందుతున్నారు. శివారుకాలనీలతోపాటు విలీన డివిజన్లలో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉండడంతో ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. నల్లానీరు సరిపడా రావడం లేదని, సమయపాలన లేదని, తక్కువ ప్రెషర్‌తో నల్లానీరు వస్తోందని ప్రజలు చెబుతున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసినా గంట సేపు పూర్తి ప్రెషర్‌తో అన్ని ప్రాంతాలకు సమానంగా నీటిని ఇవ్వాలని కోరుతున్నారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

- ఎన్నికల సమయంలో రూ. 8.96 కోట్లు, 1,609 లీటర్ల మద్యం పట్టివేత
- 611 మంది పాత నేరస్థుల బైండోవర్, 89 ఆయుధాల డిపాజిట్
- 25 ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు
- 'నిఘా నీడ'లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం

కరీంనగర్ క్రైం, మే 15: పార్లమెంట్ ఎన్నికల సమయంలో కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించి భారీగా నగదు, మద్యం, వెండి, ఇతర వస్తువులు పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి తనిఖీల్లో సరైన ఆధారాలు చూపించని వ్యక్తుల వద్ద 8.96 కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తగిన రశబూదులు చూపిన వారికి 1.02 కోట్ల రూపాయలు తిరిగి అప్పగించారు. మిగతా డబ్బులు సంబంధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశారు. పోలీసులు, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల తనిఖీల్లో 1,609 లీటర్ల మద్యం పట్టుకుని, 216 కేసులు నమోదు చేశారు. ఈ మద్యం విలువ 11,27,775 రూపాయలుంటుంది. 1,09,550 రూపాయల విలువ కలిగిన 4.86 కిలోల గంజాయిని పట్టుకుని ఏడు కేసులు నమోదు చేశారు. మూడు లక్షల విలువైన నాలుగు కిలోల వెండి ఆభరణా లు, ఐదు లక్షల విలువైన చీరలు, ఇతర కానుకలు పట్టుకున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న 89 లైసె న్సడ్ ఆయుధాలను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధాగారంలో డిపాజిట్ చేయించారు. 611 కేసులలో 1,874 మంది పాత నేరస్థులను బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు వ్యక్తులకు జరిమానా విధించారు. బెల్ట్‌షాపులను మూయించి వేశారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద నిబంధనలు ఉల్లంఘించినవారిపై 25 కేసులు నమోదు చేశారు. సైదాపూర్, హుజురాబాద్‌లో 2,130 కిలోల గన్ పౌడర్, 10 డిటోనేటర్లు, 200 జిలెటిన్‌స్టిక్స్‌ను పట్టుకుని రెండు కేసులు నమోదు చేశారు.

● ప్రశాంతంగా ఎన్నికలు

కమిషనరేట్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పటిష్టమైన భద్రత చర్యలతో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కమిషనరేట్ వ్యాప్తంగా ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా సీపీ అభిషేక్ మొహంతి ప్రత్యేక ప్రణాళికతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బందికి సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ శాంతిభద్రత సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. గొడవలు, అల్లర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఎన్నికల కేసుల్లో ఉన్న పాత నేరస్థులు, హిస్టరీ, రౌడీ షీటర్లను ముందుగానే పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. . ఈవీఎంలను భద్రపరిచిన ఎస్సారార్ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి, రౌండ్ ద క్లాక్ సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. స్ట్రాంగ్‌రూంను ప్రతి రోజు కలెక్టర్, సీపీ పరిశీలిస్తున్నారు.



కరీంనగర్‌లో పట్టుబడిన మద్యం(ఫైల్)

ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి?

కరీంనగర్ క్రైం, మే 15: ప్రేమ వ్యవహారంలో ఒక యువకుడిని కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద కొందరు దాడిచేసి గాయపరిచినట్లు తెలిసింది. రామగుండం ప్రాంతానికి చెందిన యువతీ యువకులు ప్రేమించుకుని వివాహం చేసుకునేందుకు మంగళవారం కరీంనగర్‌కు వచ్చారు. యువతికి సంబంధించిన బంధువులు వారిని వెంబడించి రేకుర్తి వద్ద వారిని అడ్డుకుని యువకుడిపై దాడి చేసి, అతడిని మరో ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. వరంగల్‌కు చెందిన యువకుడు కొంత కాలంగా రామగుండం ప్రాంతంలోనే ఉంటూ ఆ ప్రాంతంలోని ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు యత్నించగా ఈ ఘటన చోటు చేసుకుందని సమాచారం. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిసింది.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం


సర్వాపూర్‌లో కళాకారుల ప్రదర్శన

మల్యాల, మే 15: మండలంలోని సర్వాపూర్‌లో సీతారామాంజ నేయ భజన మండలి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిరుతల రామాయణము నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ భక్త మార్కండేయ నాటక కళా మండలికి చెందిన కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. సర్వా పూర్, బల్వంతాపూర్, కొత్తపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటక ప్రదర్శనను తిలకించారు.

అసంపూర్తిగా ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

● 10 నెలలు గడిచినా పూర్తికాని వైనం ● దుమ్ము, ధూళితో ఇబ్బందిపడుతున్న ప్రజలు


కోతకు గురవుతున్న ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

చిగురుమామిడి, మే 15: మండలంలోని ఉల్లంపల్లి-సుందరగిరి గ్రామానికి సంబంధించిన రోడ్డు పనులు నిలిచిపోయాయి. గ్రామ ప్రజల ఉద్యమాల ఫలితంగా గత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణానికి 2.25 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. నాటి ఎమ్మెల్యే గత ఆగస్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే రోజు మండలంలోని ముదిమాణిక్యం, రామంచ, ఓగులాపూర్ గ్రామాల రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఆ గ్రామాల్లో రోడ్డు పనులు పూర్తయ్యాయి. 10 నెలలు గడిచినా రోడ్డు పనులు పూర్తి కాలేదు. రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, కల్వర్టులు, ఇతర పనులు ఇష్టారాజ్యంగా చేశారనే విమర్శలు వచ్చాయి. సుందరగిరి నుంచి ఉల్లంపల్లి గ్రామం వరకు నామమాత్రంగా ఎర్ర మట్టి పోసి వదిలేసినారనే అరోపణలు ఉన్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో దుమ్ము లేచి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే పనులు సాగవని, ఆలోపే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం..

- చట్ల తిరుపతి, ఉల్లంపల్లి



మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సరైనా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. అనేక అందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం. కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు నిలిచిపోయాయి. వాహనాల రద్దీ, పెరిగిపోయి దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

వర్షాలు పడితే రాకపోకలకు ఇబ్బంది

- బునాద్రి సాయిలు, ఉల్లంపల్లి



ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం. ఆ రోడ్డు పనులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం అయితే రాకపోకలు నిలిచి పోతాయి. ఆలోపే పనులు పూర్తి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

త్వరగా పూర్తి చేయాలి

- చీమూర్తి మల్లయ్య, ఉల్లంపల్లి


రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయో ఎవరూ చెప్పడం లేదు. వర్షాలు ప్రారంభం అయితే పోసిన మట్టి కొట్టుకుపోతుంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డును సాధిచుకున్నాం. ఆ సంతోషం పనుల్లో జాప్యంతో ఆవిరైంది. ఇప్పటికే రోడ్డుపై వేసిన మట్టి లేచిపోతోంది. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

పిడుగుపాటుకు చింతచెట్టు దగ్ధం

● మూడు రోజులుగా చెలరేగుతున్న మంటలు


పిడుగుపాటుకు దగ్ధమవుతున్న చెట్టు

రామడుగు, మే 15: మండల కేంద్రంలో పిడుగుపాటుతో వంద సంవత్సరాల చింతచెట్టు దగ్ధమైంది.. సోమవారం సాయంత్రం చింతచెట్టుపై పిడుగు పడింది దీంతో చెట్టులో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు. తిరిగి మంగళవారం మరోసారి ఆ చెట్టులో నుంచి మంటలు చెలరేగగా గ్రామస్థులు ఆరేశారు.. బుధవారం రాత్రి మరోసారి మంటలు ఎగిసిపడి విద్యుత్ తీగలపై పడడంతో రామడుగులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. మరోసారి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు.


మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీడీఎస్ బియ్యం పట్టివేత

వెల్గటూర్, మే 15: మండలం లోని రాజక్కపల్లి గ్రామంలో ఓ ఇంటిలో నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సవిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు రాజక్కపల్లిలో పల్లపు శ్రీనివాస్ ఇంటిలో నిలువ ఉంచిన సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. బియ్యం ఉన్న గదిని వెంకటేష్ అనే వ్యక్తికి కిరాయికి ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసి పట్టుబడ్డ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

రూ. 7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,150 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 95 క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు గోనె సంచుల్లో మూడు క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,150, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించి కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీర్నపల్లి, మే 15: ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంతో పాటు ఎర్రగడ్డ తండా కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ చేసేలా చూడాలన్నారు. అయన వెంట డీపీఎం పాపారావు, ఏపీఎం నర్సయ్య, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయం



బత్తుల భూమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మే 15: ఉపాధ్యాయుడిగా, ఎంతఃవేగా సేవలందించిన బత్తుల భూమయ్య చిరస్మరణీయుడని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం చొప్పదండిలో జరిగిన బత్తుల భూమయ్య సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడుతూ భూమయ్య అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు.ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గుండ చంద్రయ్య, ఎంపీపీ చిలుక రవీందర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, నాయకులు కట్టెకోల శ్రీనివాస్‌రావు, వెన్న రాజమల్లయ్య, కాడె శంకర్, వొల్లాల క్రిష్ణహరి, ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి మండలాలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తరలించాలని రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, మే 15: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మల్కపేట రైతులు రోడ్డుపై బైఠాయించి బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అకాలు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగ వంతం చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని తరలించకపోవడంతో కాంటా వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రాస్తారోకోతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విష యం తెలుసుకున్న కోనరావుపేట ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్, మే 15: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలను నిర్వహించి అర్చన, అభిషేకం చేశారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టెలతో గ్రామం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇంద్రాల లక్ష్మీనారాయణ, రమేష్‌తోపాటు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

కోనరావుపేట, మే 15: బ్రిడ్జి నిర్మాణం కోసం ఓ కాంట్రాక్టర్ చెరువు కట్టను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి శివారులోని చిన్నన్న పెద్దన్నకుంట నుంచి హన్మాజీపేటలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణానికి అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టకు వేసిన రివీట్‌మెంటును ధ్వంసం చేసి వాహనాల ద్వారా అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టను తవ్వించి రివిట్‌మెంటును ధ్వంసం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ధ్వంసం చేసిన కట్టను, రిపీట్‌మెంట్‌ను సదరు కాంట్రాక్టర్ చేత బాగు చేయించాలని కోరుతున్నారు.


మామిడిపల్లిలో చిన్నన్న పెద్దన్న కుంటలో మట్టి తవ్వకాలు

ఘనంగా 'సందల్' ప్రదర్శన

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు ● హాజరైన ప్రభుత్వ విప్ శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


సందల్ ఊరేగింపులో గుర్రపు విన్యాసాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్వేశ్‌అలీషా ఖాద్రీ గుట్ట దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని నిర్వహణకర్త అజీజ్ ఇంటి నుంచి 'సందల్' ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ దర్గా వరకు తీసుకెళ్లారు. గుర్రపు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా వరకు ప్రదర్శనగా వెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత గురువులు బోధనలు చేశారు. అనంతరం డిల్లీ, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన రైస్ అనీస్ సబ్రి, రేహన్‌అలీ ఖవాలీ కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీపీ రేణుక, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, డీసీఆర్‌బీ డీఎస్పీ సర్వర్‌పాషాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లి దర్గా ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నసిరిసిల్ల, సిద్ధిపేట, కామారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలతో పాటు డిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మూడో రోజు నరసింహ
నవరాత్రోత్సవాలు

పంచోపనిషత్తులతో అభిషేకం, ప్రత్యేక పూజలు


స్వామి వారికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 15: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మూడో రోజు బుధవారం శ్రీ నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యా లశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభి షేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామ వేద పారాయణం తో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో భద్ర మండల, స్థాపిత దేవతా పూజ లు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సాయంత్రం కలశ పూజలు, అర్చనాది ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చారి, చిలుకముక్కు రమణాచార్యా, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నంబి అరుణ్‌కుమార్, వంశీకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


కళశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాణం తీసిన ఈత సరదా
బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి దుర్మరణం

ఓదెల, మే 15: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. మండలంలోని జీలకుంటలో బుధవారం దొడ్డేపల్లి అరవింద్ (20) అనే ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీటమునిగి మృతిచెందాడు. గ్రామస్థులు కుటుంబ సభ్యులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అరవింద్ మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోకి ఈత నేర్చుకుంటున్నాడు. ఈక్రమంలో బుధవారం బావిలో దిగగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడ దెబ్బతో గొర్రెల కాపరి మృతి

కోరుట్ల రూరల్, మే 15 : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన బూరుగుల భూమయ్య (62) అనే గొర్రెల కాపరి వడ దెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... భూమయ్య మంగళవారం గొర్రెలు, మేకలను మేపడానికి తీసుకెళ్లి సాయత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికే విరేచనాలు, వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు సమీపంలో చికిత్స నిమిత్తం జగిత్యాల అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. భూమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, మే 15: మండలంలోని కిష్టంపేట గ్రామనికి చెందిన బొద్దుల బాలయ్య(98) బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 9 గంటలకు బాలయ్య ఇంటి నుంచి బహిర్భూమి కోసం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి దగ్గరలో గల అప్పాల శ్రీనివాస్ చెందిన బావి పక్కన చెప్పులు చేతి కర్ర కనపడ్డాయి. బావిలో వెతుకగా బాలయ్య మృతదేహం లభించింది. బాలయ్య మతిస్థిమితం బాగాలేదని, బహిర్భూమికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని అతని మనువడు బొద్దుల రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్యం,
ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

చిగురుమామిడి,మే 15: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన బత్తుల వెంకటయ్య(43) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. వెంకటయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు మొదల వడంతో జీవతంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటయ్య భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

కుక్కను తప్పించబోయి
వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: మండలంలోని గొల్లపల్లి బస్టాండు వద్ద కుక్కను తప్పించబోయి బైక్ కింద పడిన సంఘటనలో మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన రాగి దేవేందర్ బుధవారం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కుక్క అడ్డు రావడంతో తప్పించేందుకు యత్నించాడు. బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, మే 15: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 5,000 జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో పెళ్లి భరత్‌లో డాన్స్ విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. గొడవను మనుసులో పెట్టుకుని ఓరుగంటి రాజు అనే వ్యక్తి 2020 సంవత్సరం డిసెంబరు 20న మరో వ్యక్తిని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు అదే రోజు మేడిపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి రాజుకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

ప్రహరీ విషయంలో వివాదం

● ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ ● గుంజపడుగులో పోలీసు పికెట్


పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

గొల్లపల్లి మే 15: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన చిన్న గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. చిన్న ప్రహరీ గోడ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన కళ్లెం తిరుపతి, పస్తం శారద ఇరు కుటుంబాల మధ్య ప్రహరీ ఉంది. గోడకు సంబంధించి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఈ రెండు కుటుంబాల మధ్య మాట మాట పెరిగి తిరుపతి శారదను అసభ్యంగా దూషించడంతో ఘర్షణకు దారితీసింది. బాధిత మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని తిరుపతి ఇంటి వద్దకు వెళ్లగా గొడవకు దారితీసి చివరికి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో తిరుపతికి సంబంధించిన ఇల్లును శారద కుటుంబ సభ్యులు పాక్షికంగా ధ్వంసం చేశారు. దీంతో కోపోద్రిక్తులైన తిరుపతి కుటుంబ సభ్యులు శారద అన్నదమ్ములైన సమ్మయ్య పోశయ్యపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం జగిత్యాల జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ కుమార్ తన సిబ్బందితో కలిసి గ్రామాని సందర్శించి ఇరు వర్గాలతో మాట్లాడి గొడవను శాంతింపజేశారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రామ నరసింహారెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్ పరిశీలించారు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేష్, శ్రీకాంత్, తోపాటు ఇరు వర్గాల చెందిన మరో ఏడుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

కన్న కూతురిపై తండ్రి అత్యాచారం

నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష

రూ. 1,000 జరిమానా, బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం

జగిత్యాల టౌన్, మే 15: కన్నకూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం ఇవ్వాలంటూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మొదటి భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిపై గతంలో కేసు ఉంది. అనంతరం వేరే మహిళను వివాహం చేసుకోగా కూతురు జన్మించింది.

2022 సంవత్సరం అక్టోబరు 14న రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో కన్న కూతురు (మైనర్)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే భార్యతో పాటు బాలికను పెట్రోల్ పోసి చంపివేస్తానని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన తల్లి తన బాలికతో కలిసి నాలుగు రోజుల అనంతరం నిందితుడి మొదటి భార్య కుమారుడికి జరిగిన దారుణాన్ని వివరించింది.

దీంతో బాలిక సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

మూడు రోజుల పాటు
డడ్జ్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, మే 15: ఇండియన్ డడ్జ్ బాల్ ఫెడరేషన్ కప్-2024 జాతీయ పోటీలు ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ డడ్జ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగే పోటీలకు దేశంలోని 12 రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొనను న్నాయని, 120 మంది పురుషులు, 120 మంది మహిళలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి ఆగస్టులో ఆస్ట్రేలియాలో జరగనున్న వరల్డ్ డడ్జ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్టు పేర్కొన్నారు. కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనిల్‌కుమార్, పాశం శ్రీనివాస్, ఓదేలు యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలి

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట, మే 15: రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని కేవీకే ప్రధాన శాస్త్ర వేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవర ణంలో మార్పుల కారణంగా వ్యవసాయంలో వచ్చే మార్పులు గమనించి, వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన విధానాలు వివరించారు. రాబోయే కాలంలో మనం నేలను రక్షించకపోతే మనం భావితరాలకి అందించడానికి ఏం మిగలదని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటి నుంచిప్రకృతి సేద్యం వైపు దృష్టి సారించా లన్నారు. నీటిని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ విభాగాల శాస్త్ర వేత్తలు సేద్య, ఉద్యాన, చేపల చెరువుల అభి వృద్ధి, చీడ పీడల నివారణ, గృహ విజ్ఞాన విషయాలపై చర్చించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతులు, విద్యా ర్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

ప్రధాని మోదీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

వేములవాడ టౌన్, మే 15: ప్రధాని నరేంద్ర మోదీ కమలం పువ్వు గుర్తు ధరించి రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 8వ తేదీన వేములవాడ రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ బీజేపీ ఎన్నికల గుర్తు కమలం పువ్వు గుర్తుతో రాజన్నను దర్శించుకున్నారని ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వేములవాడ సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్‌తో మాట్లాడగా తమకు వాట్సప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. విచారణ చేపట్టిన తర్వాత పూర్తి విషయాలు వివరిస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మతిరిగే ఫలితాలు

ఎంపీ బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 15: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దిమ్మతిరిగే ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని వి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కు లోక్‌సభ ఫలితాలు షాక్ ఇవ్వబోతున్నాయన్నారు. దేశమంతా నరేంద్రమోదీ హవా కొనసాగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలువడం ఖాయమన్నారు. ఎన్నికల్లో బీజేపీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, పెద్దపల్లి నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన ఆరూరి రమేష్, సీతారాం నాయక్, సైదిరెడ్డి, గోమాసె శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, ధన్‌పాల్ సూర్యానారాయణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి మనో హర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణిరుద్రమాదేవి, జనవాడ సంగప్ప పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ... ఒకరికి గాయాలు

చందుర్తి, మే 15: చందుర్తి మండలం మల్యాల గ్రామంలో కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువ కుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రా మానికి చెందిన ఎల్లా రమేష్ అనే వ్యక్తి బైక్‌పై వెళ తుండగా బస్టాండ్ సమీపంలో కారు ఢీకొనడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

తాడికల్‌లో రోడ్డు ప్రమాదం

● డీజిల్ ట్యాంకర్ బోల్తా.. ఒకరు మృతి ● పలువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళలు

శంకరపట్నం, మే 15: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి నిర్మాణం పనులు చేస్తున్న సంస్థకు సంబంధించిన డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. డీజిల్ ట్యాంకర్ తాడికల్ గ్రామ పంచాయతీ ఎదురుగా అదుపు తప్పి రోడ్డు పక్క న నిల్చున్న వారి మీదకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పూదరి శ్రీనివాస్ (39) అక్కడికక్కడే మృతి చెందగా, వెంగళ కనకమ్మ, ఆడెపు మౌనిక, చాగంటి ప్రకాష్, మంద రాజమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, ఆడెపు లాస్య గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రు లను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన పూదరి శ్రీనివాస్‌ను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య పూదరి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.




మృతుడు పూదరి శ్రీనివాస్ (ఫైల్)


బోల్తా పడిన డీజిల్ ట్యాంకర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

-ఎస్ఈ గంగాధర్



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, మే 15: విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేయాలని ఎస్ఈ గంగాధర్ అన్నారు. టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేస్తూ అధికారికంగా ఎల్సీ తీసుకొని పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది భద్రతకు కావలసిన పరికరాలు అందించి పెండింగ్‌లో ఉన్న పనులను తొందరగా కంప్లీట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం తిరుపతి ఏడీలు ఎస్.నరేందర్, సుధీర్‌కుమార్, కె.రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ ప్రశాంత, సత్యనారాయణరెడ్డి, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

18నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భగత్‌నగర్, మే15: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో శనివారం నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బద్దిపల్లిలోని అలర్‌మేల్ మంగ, పద్మావతి సమేతశ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం విశ్వక్సేన విధి, వాసుదేవ పుణ్యాహ వాచన వధి, అంకురారోహణ విధి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, శ్రీవ్యాహ హోమం, సర్వదేవాతాఆహ్వానం, ఆదివారం శ్రీ అలర్‌మేల్‌మంగ, పద్మావతిసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణం, 20వ తేదీ రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ఉప్పు తిరుపతి తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్న జీయర్ స్వామి మంగళాశాసనములతో జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు, అర్చకులు సింహాచలం మారుతిస్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

'రైతులను మోసం చేస్తున్న సీఎం'

భగత్‌నగర్, మే 15: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా రైతులను సీఎం మోసం చేస్తున్నారని బీజేపీ నాయకుడు, మల్కాపూర్ రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆరోపించారు. వరి ధాన్యానికి కింటాలుకు 500 బోనస్, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి విస్మరించారన్నారు. రుణమాఫీ ఆగస్టులో చేస్తామని, వర్షాకాలం పంటకు ఇవ్వాల్సిన బోనస్ యాసంగి పంటకు ఇస్తామని మాట మార్చి రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులకు బోనస్‌తో పాటు రుణమాఫీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సేంద్రియ పద్ధతిలో సాగు అభినందనీయం

-కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, మే 15: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం ఉత్తమ రైతు బొప్పు శ్రీహరి, యువ రైతు బొప్పు వాసులు సేంద్రీయ పద్ధతి ద్వారా పండించిన మామిడిపండ్లను కలెక్టర్‌కు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో వరి, వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేయడాన్ని ఇతర రైతులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తామన్నారు. ఉత్తమ రైతు బొప్పు శ్రీహరి మాట్లాడుతూ డ్రాగన్‌ఫ్రూట్‌తో పాటు, మామిడి తోటలో బంగినపల్లి, దశేరి, హిమాయత్, కేసర్, మియాజాకీ, అల్ఫాన్సా కలెక్టర్ జానకి, చెరుకు రసాలు, చిన్న రసాలు, పెద్దరసాలు, పచ్చడి కాయలు వంటి 45 రకాలను సాగు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువ రైతులు బొప్పు వాసు, దేవేందర్‌లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 15: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో టీఎస్పీఎస్సీ గ్రూప్-1, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని, అభ్యర్థులు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రూప్-1కు సంబంధించి ఈనెల 18, 20, 22, 24, 25, 27,29, జూన్1,3 తేదీల్లో ప్రిలిమ్స్ పరీక్ష కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తామన్నారు. యూపీఎస్సీకి సంబంధించి ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీల్లో పరీక్షలు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి సమాచారం కోసం 040-24071178, 040 27077929 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం



సత్యనారాయణచారిని సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఇల్లందకుంట, మే 15: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్ పదో తరగతి ఫలితాల్లో రెండోసారి వంద శాతం ఫలితాలను నమోదు చేసింది. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ మునిగడప సత్యనారాయణచారిని కలెక్టర్ పమేలా సత్పతి శాలువాతో ఘనంగా సన్మానించి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణచారి మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంతటి ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షంశోద్దీన్, శ్రీధర్, సంధ్య, భాగ్య, అమీన్, రవి, తిరుపతిరెడ్డి అజీమ్, తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు వేశారు... డ్రైనేజీ నిర్మాణం మరిచారు

● ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



అన్నారంలో రోడ్డుకు దిగువన ఉన్న మురికి కాలువ

మానకొండూర్, మే 15: మండలంలోని అన్నారం గ్రామంలో తారు రోడ్డు నిర్మించి మురికి కాల్వ నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూర్ నుంచి జమ్మికుంట రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. గతంలో ఉన్న రోడ్డు కంటే సుమారు మీటరు వరకు ఎత్తును పెంచారు. అన్నారం గ్రామంలో సగం వరకు మురికి కాల్వను ఎత్తు పెంచి నిర్మించి మరో సగం వదిలేశారు. దీంతో దిగువనున్న మురికికాల్వలోని నీరు చేరి ఎక్కడికక్కడే నిలిచి పోతోంది. గ్రామంలో రోడ్డుకిరువైపులా ఇదే పరిస్థితి ఉండడంతో మురికి నీరు బయటికి వెళ్లక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రోడ్డుకిరువైపులా పూర్తి స్థాయిలో మురికి కాల్వను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేణుక ఎల్లమ్మ పట్నాలు

సుల్తానాబాద్, మే 15: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. తొగర్రాయి గ్రామంలో బీరన్న పట్నాలు నిర్వహించగా ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు వేగోలం సదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

-ఉత్తమ ఫలితాలు సాధించిన హెచ్ఎంలకు నగదు బహుమతి -కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మీ ఇల్లును ఎంత బాధ్యతాయుతంగా చూసుకుంటారో అదే బాధ్యతతో ప్రభుత్వ పాఠశాల లను చూసుకోవాలని కలెక్టర్ హెచ్ఎంలకు సూచిం చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరి యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో పదో తరగతి ఫలితాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్ఎంలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బాగుంటేనే ప్రజల నుంచి ఆదరణ ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తాగు నీరు, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యాలా చూడాలని పేర్కొన్నారు. పాఠశాలలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని హెచ్ఎంలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో సక్సెస్‌ఫుల్‌గా తీర్చిదిద్దిన పది మంది హెచ్ఎంలను ఎంపిక చేసి నగదు బహుమతి అందిస్తానని వెల్లడించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు సబ్జెక్టు వర్క్‌షాపులు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతివారం జిల్లాలో ఒక పాఠశాలను సందర్శిస్తానని ఆమె పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యాభివృద్ధికి హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. జూన్ 3 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు షూస్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు త్వరగా అందించేలా చూడాలని ఆదేశించారు. పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన 84 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్ రావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నరసింహస్వామి, ఏఎంఓ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, ఎంఈవోలు, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్,మే 15 : నగరంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. గౌతమినగర్ ఫీడర్‌లో తిరుమల్‌నగర్, కట్టరంపూర్, కోతిరాంపూర్, భవానీనగర్, శ్రీనావాస్ నగర్, ప్రొఫెసర్ నగర్, దుర్గాదేవినగర్, దుర్గాదేవినగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

అలయన్స్‌క్లబ్ సన్నాహక సమావేశం

సుభాష్‌నగర్, మే 15: అలయన్స్‌క్లబ్ గవర్నంగ్ బాడి ఇన్‌స్టాలేషన్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక అచీవర్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీనగర్ కాలనీ, సరస్వతినగర్ క్లబ్ సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 19న అచీవర్స్ పాఠశాలలో ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం, పీఎస్‌జీ శిక్షణ నిర్వహించనున్నట్లు క్లబ్ బాధ్యులు తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్‌రావు, జిల్లా గవర్నర్ చెర్మాల వెంకటేశ్వర్లు, విడిజి-1 శ్రీనివాస్‌గాంధి, విడిజి-2 కొంజర్ల మహేశ్, ఎస్ఎస్‌వి ప్రసాద్, సోమారపు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ శిక్షణకు జిల్లా అథ్లెట్స్



శిక్షణకు ఎంపికైన అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 15: జిల్లాకు చెందిన జాతీయ అథ్లెట్స్ ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న శిక్షణకు ఎంపికయ్యారు. జిల్లా క్రీడాకా రులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని విశేష ప్రతిభ చాటిన ఎస్ అజయ్, ఎం వినయ్, శ్రీచరణ్, అరుణ్, ఈ విష్ణువర్ధన్, ఎ అర్జున్‌లు హైఆటిట్యూడ్ శిక్షణకు ఉత్తరఖండ్ రాష్ట్రంలోని చంపావత్ జిల్లా లోగత్ గ్రామంలో శిక్షణ పొందుతున్నారు. సముద్ర మట్టానికి రెండు వేల మీటర్ల ఎత్తున కొండ ప్రాంతంలో వీరు ప్రత్యేక శిక్షణను మిడిల్ రన్, లాంగ్ డిస్టెన్స్ పది కిలోమీటర్ల వర్కవుట్‌తో తర్ఫీదు పొందుతున్నారని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, ఫెదర్స్ అథ్లెటిక్స్ అకాడమి కోచ్ వరుణ్‌కృష్ణన్ తెలిపారు. ఈ ప్రదేశంలో సాధారణ ఉష్ణోగ్రతలు 8 నుంచి 22 సెంటిగ్రేడ్‌ల వరకు ఉంటుందని, తద్వారా రానున్న జాతీయ పోటీల్లో వీరు మంచి ప్రతిభను కనబరచవచ్చని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ప్రత్యేక శిక్షణలో భాగంగా భోజనం, వసతి సౌకర్యాలు జిల్లాకు చెందిన ఫెదర్స్ అథ్లెటిక్ అకాడమి, వివేకానంద డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ధనపురి సాగర్ కల్పించినట్లు తెలిపారు.

ఆశా వర్కర్లకు అలవెన్స్‌లు చెల్లించాలి

-సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

సుభాష్‌నగర్/భగత్‌నగర్, మే15: అసెంబ్లీ, పార్ల మెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు తమ సొంత గ్రామాల్లో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌ల పరిధిలో డ్యూటీ చేయాల్సి ఉందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు మినహా ఇతరులందరికీ టీఏ, డీఏలు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా ఆశా వర్కర్లు ఆటో కిరాయిలు, టిఫిన్, భోజనం ఇతర ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి సుమారు 500రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ దృష్టికి తీసుకెళ్ళగా ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు ఇచ్చామని, వెళ్ళి జిల్లా ఎన్నికల అధికారిని కలవాలని సూచించినట్లు చెప్పారు. కమీషనర్ సూచనల మేరకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. జగిత్యాల, సిరిసిల్లలో ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు ఇచ్చారని కరీంనగర్‌లో మాత్రం ఇవ్వలేదని వారు ఆరోపించారు.

వెంటనే ఆశా వర్కర్లకు టీఏ, డీఏలను ఇవ్వాలని లేని యెడల కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడుతామని, రానున్న ఎన్నికలను కూడా బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి పున్నం రవి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సరిత, వెంకటలక్ష్మీ, అంజలి, ప్రియాంక, జీవలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, శోభ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఇప్పల్‌నర్సింగాపూర్ రోడ్డు



గుంతలమయంగా మారిన ఇప్పల్ నర్సింగాపూర్ రోడ్డు

హుజూరాబాద్, మే 15: హుజూరాబాద్ డిపో క్రాస్ నుంచి ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్డు వెంట హుజూరాబాద్ నుంచి భీమదేవరపల్లి మండలానికి పెద్ద ఎత్తున రాకపోకలు సాగుతుంటాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతిన్నది. దీనికి మరమ్మతులు చేయాల్సిన పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నది. బ్రిడ్జిపై రోడ్డు గుంతలమయమైంది. ఆ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'సబ్సిడీ గొర్రెల పథకాన్ని కొనసాగించాలి'

చిగురుమామిడి, మే 15: సబ్సిడీ గొర్రెల పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని గొర్రెల పెంపకం దారుల సహకర సంఘం మాజీ డైరెక్టరు కత్తుల రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బొమ్మనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గొల్ల కురమ యాదవులకు డీడీలను వాపసు ఇస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వ తీరు ఖండనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,686 మంది యాదవులకు డీడీలు వాపసు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ అంశంపై ఉద్యమాలు చెయ్యడానికి యాదవులంతా సిద్ధం కావలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గొర్రెల పథకాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పథకంతో యాదవులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినారని తెలిపారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంతమని, నీళ్ల లేక వ్యవసాయం చేసుకోలేని గొల్ల కురుమలు గొర్రెల పంపిణీతో లబ్ధి పొందారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పథకాన్ని రద్దు చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సతీష్ యాదవ్, ప్రవీణ్, రమేష్, ప్రశాంత్, అనిల్, అంజయ్యతో పాటు వివిధ గ్రామాల యాదవులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన ఉత్సవ మూర్తులు

జమ్మికుంట రూరల్, మే 15: జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై కేసు నమోదు

మానకొండూర్, మే 15 : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్‌కు చెందిన భూపతి కనకవ్వ అనే వృద్ధురాలికి ఈ నెల 2న జ్వరం రావడంతో గ్రామంలో ఆర్ఎంపీ మమతకు చూపించగా ఇంజక్షన్ వేసిందన్నారు. దీంతో దద్దులు రావడమే కాకుండా నోటిమాట నిలిచిపోయిందని తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి సీరియస్‌గా ఉందన్నారు. ఆర్ఎంపీ మమతపై బాధితురాలి కుమారుడు భూపతి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మార్కెటింగ్ డీఎం పద్మావతి

గంగాధర, మే 15: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు తర్వగా పూర్తి చేయాలని మార్కెటింగ్ డీఎం పద్మావతి అధికారులను ఆదేశించారు. గంగాధర మండలం పత్తికుంటపల్లి, మధ్రిగడ్డ, మంగపేట, ఇస్తారుపల్లి, లక్ష్మీదేవిపల్లి,నారాయణపూర్, నాగిరెడ్డిపూర్, సర్వింహులపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఆమె బుధవారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులుపూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పాఠశాలల్లో కరెంటు పని, తాగు నీటి కోసం జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. ఆమె వెంట ఎంఈవో వేణు, ఏఈ రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తిమ్మాపూర్ (మానకొండూర్), మే 15 : మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన సదిరే నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలోని ఆదర్శ పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన నర్సయ్య కుటుంబానికి బుధవారం లక్షా మూడు వేల రూపాయలను సమితి అధ్యక్షులు గుంటి వెంకటేశ్, సంఘం అధ్యక్షులు నాగపురి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సదిరే సంపత్, పాలక వర్గ సభ్యులు బిజిలి సమ్మయ్య, బొజ్జ రాజమౌళి, నాగపురి మహేశ్, నీలం రాజ్‌కుమార్, కొమురయ్య, సుదర్శన్, అంజయ్య, ఐలయ్య, కనుకయ్య, నూనె వెంకటేశ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సన్మానం

జమ్మికుంట, మే 15: హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి జన్మదిన వేడుకలు

మానకొండూర్, మే 15 : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ అమీరుల్లాఖాన్, మాజీ మండల అధ్యక్షులు శాతరాజు యాదగిరి, మాజీ సర్పంచులు ఎరుకల శ్రీనివాస్, రామంచ గోపాల్‌రెడ్డి, పిట్టల మధు, దండబోయిన శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మే15: కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. యువత పెడతోవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. నేటి యువత 30సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లలో, అనారోగ్యాలతో చాలామంది మరణిస్తున్నారని, తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని అన్నారు. నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని, తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, జిన్న రమ, కన్నూరి రేణుక, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓడేడు-జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలి

కాల్వశ్రీరాంపూర్, మే 15: ఓడేడు-జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలు మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంథని నుంచి జమ్మికుంట వరకు, జమ్మికుంట నుంచి ఓడేడు వరకు ప్రతిరోజు రెండు ట్రిప్పులు నడిచేది. ఉదయం ఓడేడు నుంచి 4.3గంటలకు బస్సు బయలుదేరి ముత్తారం, పారుపల్లి, ఇదిలాపూర్, జాఫర్‌ఖాన్‌పేట్, మంగపేట, కునా రం, గంగారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలం పలు గ్రామాల నుంచి జమ్మికుంట వరకు బస్సు నడవడం వలన ఉదయం పనుల నిమిత్తం హన్మకొండకు వెళ్లే ప్రయాణికు లకు ఈ బస్సు ఉపయోగకరంగా ఉండేది. ఈ బస్సు నడవ డం వలన ప్రయాణికులు ఉదయం హనుమకొండకు వెళ్లి పనులు ముగించుకొని తిరిగి జమ్మికుంటకు వచ్చేవరకు సాయంత్రం 6.30 గంటలకు ఈ బస్సు ఉండేది. ఈ బస్సు నడవడం వలన ప్రయాణికులకు, హన్మకొండకు ఆసుపత్రికి వెళ్లే వారికి ఉపయోగకరంగా ఉండేది. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలలోని ఆయాగ్రామాల నుంచి పైచదువుల కోసం విద్యార్థులు ప్రతిరోజు జమ్మికుంటకు వెళ్లి వస్తుంటా రు. గతంలో ఈబస్సు నడవడం వలన విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉండేది. కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజ లు హన్మకొండకు, జమ్మికుంటకు వెళ్లాలన్న ప్రస్తుతం కొల నూరు, ఓదెల రైల్వే స్టేషన్లకు వెళ్లి భాగ్యనగర్ ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు. ఈ భాగ్యన గర్‌కు వెళ్లేందుకు కూడా బస్సులు లేని కారణంగా ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లవలసి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అప్పుడప్పుడు సమయానికి ప్రైవేటు వాహ నాలు లేకుంటే భాగ్యనగర్ ట్రైన్ కూడా అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఓడేడు నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సు మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. కొన్ని నెలలుగా మంథని ఆర్టీసీ డిపో అధికారులు బస్సును నిలిపి వేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి ఓడేడు-జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్తి స్థాయి ఎంఈవోలను నియమించాలి

ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు రవీందర్

కొడిమ్యాల, మే15: జిల్లాలో పూర్తి స్థాయి ఎంఈవోలను నియామకం చేయాలని కోరుతూ బుధవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ జిల్లా కలెక్టర్, డీఈవోకు వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఆయన విలే కరులతో మాట్లాడుతూ మండలానికి ఒక ఎంఈవో ఉండాల్సి ఉండగా జి ల్లాలోని 18 మండలాల్లో 8 మంది ఎంఈవోలు మాత్రమె జిల్లా వ్యాప్తంగా భారంగా ఎంఈవో విధులు నిర్వహిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఒక ఎంఈవో మూడు లేదా నాలుగు మండలాలకు సంబంధించిన అదనపు బాధ్య తలను నిర్వహించడంతో ఒత్తిడికి గురవుతు న్నారన్నారు. అంతే కాకుండ మోడల్ స్కూల్ కస్తూరీబా పాఠశాలలు, విద్యార్థులకు అందించె మధ్యాహ్న భోజనం విషయాలలో పర్యవేక్షణ కొరవడుతుందన్నారు. ఇటీవల జిల్లాలోని ఒక ఎంఈవో పని భారం వలన మృతి చెందినట్లు తెలిపాడు. జిల్లాలో పూర్తి స్థాయి ఎంఈవోలను నియమించాలని రవీందర్ కోరారు.

ఏఎన్ఎంపై ఫిర్యాదు

తంగళ్ళపల్లి, మే 15: ఏఎన్ఎం కరుణ సరిగా విధులు నిర్వహించడం లేదని తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన గడ్డం భాస్కర్‌రెడ్డి నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. పిల్లలకు వ్యాక్సిన్ వేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే తనతో పాటు గ్రామంలోని చాలామంది ఇబ్బందులు ఎదుర్కొన్న ఎదుర్కొంటున్నారని తమకు, పిల్లలకు ఆరోగ్య సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, మే 15: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఇటీవ ల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద అనుప రాజు కుటుంబానికి బుధవారం స్థానిక ఎవర్ గ్రీన్ యువజన సంఘం సభ్యులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కూతురు మనుశ్రీ పేరిట ఆ డబ్బులను తపాలా కార్యాలయంలో ఫిక్సడ్ డిపాజిట్ చేశారు.